మనసున్న మహారాజు సీఎం కేసీఆర్




లబ్ధిదారురాలికి పట్టాను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు, మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్.

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కుషాయిగూడ: పేదల సొంతింటి కలను సాకారం చేసిన మహోన్నతుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ చర్లపల్లిలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి డబుల్ ఇళ్లను ప్రారంభించారు. ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాలకు చెందిన వెయ్యి మంది లబ్ధిదారులకు చర్లపల్లి, అహ్మద్‌గూడ, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడారు. ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్ మనసున్న మహారాజు అన్నారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ ఇళ్లు వస్తాయన్నారు. లక్షల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలన అనంతరం విడతలవారీగా ఇళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించాలని..

ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్న వాస్తవాన్ని గ్రహించి ఎలాంటి అపోహలకు తావివ్వకూడదన్నారు. టీవీల ముందు, పేపర్లలో ఏకాణాకు పనికిరానోడు ఏందెందో మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారు. మొన్నటి వరకు అధికారంలో ఉన్నప్పుడు 24 గంటల కరెంటు, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, రైతుబంధు, డబుల్ ఇండ్ల నిర్మాణం, తాగు, సాగునీరు వంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదో నిలదీయండన్నారు. 70 ఏళ్ల తెలంగాణ కల సాకారమైన వేళ పేదోడు గొప్పగా జీవించాలన్నది కేసీఆర్ ఆశయమన్నారు. వందల కోట్లు విలువ చేసే భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మించి తన చిత్తశుద్ధి చాటుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ఆయన సంకల్పమని, ఆ దిశగానే ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పంకజ, కీసర ఆర్డీఓ రాజేష్, కాప్రా డీసీ ముకుందరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట్‌దాస్‌రెడ్డి, డీఈ గంగాధర్, తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, బన్నాల గీతాప్రవీణ్, మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, పావనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

డబుల్ ఇళ్ల పంపిణీ నేపథ్యంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ముందుగా లబ్ధిదారులకు అందజేసిన ఐడీ కార్డులు ఉన్న వారి కుటుంబాలను మాత్రమే ప్రాంగణంలోకి అనుమతించారు.

ముందస్తు అరెస్టులు..

చర్లపల్లిలో డబుల్ ఇళ్ల పంపిణీ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు అరెస్టులు మొదలుపెట్టారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన ముఖ్యనేతలను ముందస్తుగా అరెస్టు చేసి కుషాయిగూడ, చర్లపల్లి పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

సంతోషంగా ఉంది



నేను మహిళ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాను. నాకు ఎలాంటి ఆధారం లేదు. అద్దె ఇంట్లో ఉంటూ జీవిస్తున్నాను. నాకు డబుల్‌బెడ్ రూం ఇల్లు రావడం ఎంతో సంతోషంగా ఉంది. కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను.

\- మౌనిక, హెచ్‌బీకాలనీ

కలలో కూడా ఊహించలేదు



నేను ఇంట్లోనే ఉంటాను. మా ఆయన ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తాడు. వచ్చిన జీతంలో ఇంటి అద్దెకే సగం డబ్బులు పోయేవి. చాలీచాలని జీవితం గడుపుతున్నాం. సొంతిళ్లు వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

\- విజయ నిర్మల, అల్వాల్

సమష్టి కృషితోనే వైద్య ప్రమాణాలు మెరుగు



మాట్లాడుతున్న వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్



ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

అల్వాల్: జిల్లాలో వైద్య ప్రమాణాలు పెంచడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం అల్వాల్‌లో జరిగిన సమావేశంలో వైద్య సిబ్బంది, అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను మెరుగుపర్చాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఆరోగ్య శాఖకు మూలస్తంభాలుగా పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానానికి చేరుకునే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. ఇందుకు అవసరమయ్యే పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య అధికారి డాక్టర్ ఆనంద్, జిల్లా ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కలు, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నాన్ కమ్యూనికేబుల్ డిసిజ్‌లపై జిల్లాస్థాయి వర్క్‌షాపు

ఉప్పల్: నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులపై జిల్లా స్థాయి వర్క్‌షాపు బుధవారం ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రంలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, డీఈవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ హైపర్ టెన్షన్, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ల కోసం 30 సంవత్సరాల పైబడినవారి వివరాలను సేకరించడంతోపాటు వారిని లెక్కించాలని సూచించారు. కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌పై డాక్టర్లతో పాటు డేటా ఎంట్రీ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. శిక్షణ లక్ష్యం కేన్సర్, మధుమేహం, కార్డియో వాస్కులర్ డిసీజ్, స్ట్రోక్ నివారణ, నియంత్రణ తదితర అంశాలపై జాతీయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా వీటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డా.నారాయణరావు, డా.రఘునాథ స్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

కాలనీలో అరాచకాలు సృష్టిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

- రాజకీయ కారణాలతో కాలనీలో విధ్వంసం సరికాదు
- అల్వాల్ రాక్ ల్యాండ్ ఎవెన్యూ కాలనీవాసులు

అల్వాల్: రాజకీయ కారణాలతో మా కాలనీ విధ్వంసానికి పాల్పడటం సరికాదని అల్వాల్ రాక్ ల్యాండ్ ఎవెన్యూ కాలనీవాసులు అన్నారు. గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాలనీవాసులు మాట్లాడుతూ అన్ని నిబంధనల మేరకు స్థలాన్ని కొనుగోలు చేసి నిర్మాణాలు చేసుకున్నామని ఇటీవల కొందరు రాజకీయ కారణాలతో విభేదాలు సృష్టించి కాలనీపై దాడి చేయడం జరిగిందన్నారు. స్థలానికి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. స్థల వివాదం పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. స్థల వివాదం ఉంటే సంబంధిత న్యాయపోరాటం చేయాలి. కానీ.. జేసీబీలు తీసుకొచ్చి కాలనీలో అరచాకాలు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమం సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌కు బస్సులు నడపాలని వినతి

ఉప్పల్: గతంలో మాదిరిగా ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్‌కు ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం స్థానికులు జూబ్లీ బస్‌స్టేషన్ సికింద్రాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రెండు సంవత్సరాల క్రితం ఈ ప్రాంతానికి బస్సు సౌకర్యం ఉండేదని తెలుపుతూ రూట్ నంబర్లను అందజేశారు. నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి, చంగిచర్ల తదితర పారిశ్రామిక వాడలతో పాటు చిలుకనగర్, హేమానగర్, బోడుప్పల్ తదితర పదుల సంఖ్యలో కాలనీలు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని కాలనీ వాసులు కోరారు.

నైపుణ్యతతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు

రాష్ట్ర సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్



కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ తదితరులు

రామంతాపూర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఐబీఎం సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌కు రాష్ట్ర సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్య కోర్సులు చదివే విద్యార్థులు ఆయా పురుషుల్లోని నైపుణ్యతను అవగాహనతో అభ్యసిస్తే దేశ విదేశాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్య సెక్రటరీ ఎ.పుల్లయ్య, ప్రిన్సిపాల్ వినయ్ కుమార్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విభాగాధిపతి వెంకటేశ్వర్లు, ఎంప్లాయిమెంట్ అధికారి మైత్రి ప్రియ, అంజలి వర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బాలికల విద్య కోసం ఆర్థిక చేయూత

సాక్షి, సిటీబ్యూరో: మహీంద్రా సారథి అభియాన్ ప్రాజెక్ట్‌లో ట్రక్ తదితర వాహనాల డ్రైవర్ల కుమార్తెల విద్యాభ్యాసం కోసం ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఈ విషయాన్ని మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలికలకు వచ్చే విద్యా సంవత్సరానికి తదుపరి విద్యను అభ్యసించేందుకు రూ.10 వేల చొప్పున 1100 కొత్త స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. అంతేగాకుండా సర్టిఫికెట్ ఇచ్చి సత్కరిస్తామని వివరించారు. ఇప్పటిదాకా 8,928 మందికి ఈ స్కాలర్‌షిప్స్ అందాయన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

గౌతంనగర్: ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజశ్రీనివాస్‌నగర్, పీపీఎస్ కాలనీ, సెయింటాన్స్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆపదలో ఉన్నవారికి అండగా..



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందుకుంటున్న గండమ్మ

బోడుప్పల్: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి వరం అని 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ అన్నారు. ఇందిరానగర్‌కు చెందిన సీహెచ్ గండమ్మ భర్త నర్సింహకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.24 వేలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరిన వారికి ఈ పథకం చేయూతగా నిలుస్తుందన్నారు.

యశ్వంత్ యాదవ్‌కు నివాళి

బోడుప్పల్: బోడుప్పల్ 20వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ కుమారుడు యశ్వంత్ యాదవ్(22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయనకు పలువురు నివాళులర్పించారు. బుధవారం రాత్రి ఖైరతాబాద్ వినాయకుడి దర్శనానికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ రాంనగర్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్ నివాళులర్పించారు.

అభినందనలు



మల్కాజిగిరి: మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించడంతో పలుమార్లు రిజర్వేషన్లపై గళమెత్తిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మల్కాజిగిరి నియోజకవర్గం భారత్ జాగృతి కన్వీనర్ నవీన్‌కుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వినతి



జలమండలి జీఎం సునీల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

అల్వాల్: మల్కాజిగిరి డివిజన్‌లో నెలకొన్న భూగర్భ పైపులైన్, వాటర్ ప్రెషర్ సమస్యలు ఆలస్యం కావడంపై మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మల్కాజిగిరి డివిజన్‌లో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు భరత్‌సింగ్ నగర్‌లో నూతన పైపులైన్ మంజూరు, ఓల్డ్ మల్కాజిగిరి, నర్సింహారెడ్డినగర్‌లో నూతన జంక్షన్, ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో నూతన పవర్‌బోరు సెట్‌ను వెంటనే మంజూరు చేయాలని జీఎం సునీల్‌కుమార్‌కు కార్పొరేటర్ వినతి పత్రం అందజేశారు. స్పందించిన జీఎం సునీల్‌కుమార్ వెంటనే ఫైల్ మీద సంతకం పెట్టి బోర్డుకు పంపడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు.

చర్లపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన కాప్రా, చర్లపల్లి చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా చెరువుల వద్ద ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్, పన్నాల దేవేందర్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇంజినీరింగ్ ఈఈ హరిలాల్ నాయక్, ఏఈలు స్వరూప, అభిషేక్, లింగారావు, మాజీ కార్పొరేటర్ పావనిరెడ్డి, నాయకులు సుడుగు మహేందర్‌రెడ్డి, డప్పు గిరిబాబు, నాగిళ్ల బాల్‌రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జయజయ వినాయకా..



మేడిపల్లిలోని అనురాధ అపార్ట్‌మెంట్ బ్లాక్-సీలో వినాయకుడి పూజలు



ఉప్పల్ బబుల్జ్ పాఠశాలలో ఆకట్టుకుంటున్న చంద్రయాన్ గణేష్



బోడుప్పల్ ఆనంద్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో పూజల్లో మాజీ ఎంపీటీసీ నాగేశ్వర్‌గౌడ్ దంపతులు



మౌలాలిలో కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్



ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు



శివఅమర్‌నాథ్ ఈశ్వర్ అపార్ట్‌మెంట్‌లో..



నిమజ్జనానికి..



మల్లాపూర్‌లో ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టు

అల్వాల్: బీఆర్‌ఎస్ మొండి వైఖరిని ఖండిస్తున్నామని అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ వస్తుండటంతో ఉదయం 6 గంటలకు పోలీసులు కాంగ్రెస్ నేతలు నిమ్మ అశోక్‌రెడ్డి, జోలి రమేష్, కృష్ణగౌడ్, పవన్‌కుమార్, శ్రీనివాసులు, డప్పు రాజు, బుజ్జి, నర్సింగ్, దుర్గేష్‌ను ముందస్తుగా అరెస్టు చేసి అల్వాల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు